

పది గంటలు దాటిన రాత్రవుతోంది. కాటుకంత చిక్కనైన చీకటిని కప్పుకుని ఊరు నిద్రబో ది. ఇంకా ఆమె అక్కడ గుమ్మం దగ్గర్నుంచి కదలలేదు. ఎవరు ఆమె?!



# ఆమె ఒక బాట




మువ్వా శ్రీనివాసరావు

ఆమె ఎవరైతేనేం? ఓ బాట లాంటి, మధ్యలో ఆగిపోయిన పాట లాంటి, ఎప్పుడో పాడు పడిన కోట లాంటి జీవితాల తాలూకూ అనేకానేక భౌతిక రూపాల్లో ఓ రూపం ఆమె!

ఆమెలానే అక్కడక్కడా ఆమెలాంటి ఆ రూపాలు, కొంత మంది కూడా ఇంకా వాళ్ళ ఇళ్ళ ముందు గుమ్మాల దగ్గర్నుంచి కదల్లేదు ఆ వేళకు.

రిక్షా వస్తున్న శబ్దం వినిపించి ఆమె అర్ధనిమీలిత నేత్రాలు చురుగ్గా అటువైపు చూశాయి. ఊహించినట్లుగా ఆ రిక్షా ఆమె ఇంటి గుమ్మం దగ్గరే ఆగింది. అందులోంచి వళ్ళంతా వాంఛను నింపుకొచ్చిన ఓ నల్లటి దేహం జర్దా కిళ్ళీ నములుతోన్న నోటితో ఉమ్మి కిందకు దిగింది.

అతన్ని చూసి ఆమె కాస్తింత కంపితురాలైనా ధృతి కల్పించుకుని కృత్రిమమైన నవ్వును కాలువ్యమై పోయిన తన ముఖం మీద తెచ్చి పెట్టుకుని అతనికి స్వాగతం పలికింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మెత్తగా స్పృశించింది. అతన్ని ఆ గదిలోకి తీసుకెళ్ళి తలుపు ఘడియ పెట్టింది.

దండెం మీద వేల్లాడుతున్న పాత చీరలూ జాకెట్లు, అడ్డదిడ్డంగా పడివున్న వంట సామగ్రి, మినుకు మినుకు మంటున్న లాంతరు, మరింత కుక్కయిపోయిన నవ్వారు మంచం, ఆ మంచం మీద అతను - ఆమె!

అతను ఆమెను తదేకంగా చూస్తున్నాడు. మనక వెల్తుర్లో ఆమె కట్టుకున్న జరీ అంచు తెల్ల చీర మెరుస్తున్నట్లుగా ఉంది. సల్లటి తురుల్లో ఆమె తరుముకున్న జాజి మల్లెల వాసన గుప్పుమంటోంది.

ఆమెను చూస్తుంటే అతని గుండెల్లో సౌందర్య తృష్ణ తిరగబడుతోంది. కానీ ఆమె మాత్రం కదలని ఓ యంత్రంలా కదలకుండానే ఉంది. గదిలో మరింత ఉక్కపోస్తోంది గాలి వచ్చే మార్గమే లేకపోవడంతో.

మరికొంతసేపటికి అతను ఆమెను దగ్గరకు తీసుకుని అన్నాడు "నీ పేరు?"

"అవసరమా?!" ఆమె కళ్ళు గుడ్డి వెల్తురులో నిరాశగా కదిలాయి. "అవసరమైతేనే కానీ చెప్పవా" కిళ్ళీతో ఎర్రబడ్డ పెదాలు వికృతంగా కదిలాయి.

"పేరు చెప్పడం వలన ఉపయోగం లేనప్పుడు నేను చెప్పడం నువ్వు తెల్సుకోవడం అనవసరం"

"కోరుకున్న మనిషి పేరు తెల్సుకోవడం అనవసరమెలాగవుతుంది".

"పొరబడుతున్నావ్. నువ్వు కోరుకున్న మనిషిని కాదు నేను. కేవలం తాత్కాలికమైన కోరికను కలిగించిన మనిషిని మాత్రమే"

"లేదు! నేను కోరుకున్న మనిషివి నీవే నిన్ను చూసిన వెంటనే నేను హృదయం పారేసుకున్నాను. అసలు పెళ్ళే చేసుకోకూడదని నిర్ణయించుకున్న నేను నిన్ను చూసిన తరువాత పెళ్ళి చేసుకోవాలని చేసుకుంటే నిన్నే చేసుకోవాలని గట్టిగా అనుకుంటున్నాను". "నన్ను పెళ్ళి చేసుకోవడమా? కైపెక్కించిన మందు మత్తులో నిన్ను నువ్వు మర్చిపోయి మాట్లాడుతున్నావు. వచ్చిన పని త్వరగా ముగించుకుని వెళ్ళిపో"

మందు మత్తుతో కాదు. నిజమే మాట్లాడుతున్నాను. ఏఁ! నిన్ను పెళ్ళి చేసుకోకూడదా? నాక్కావాల్సింది మంచి మనసున్న ఆడది. నన్ను అర్థం చేసుకున్న ఆడది. నా కంతే చాలు". "ముఖం చూసి మనసు గూర్చి చెప్పొచ్చు. మెదడును చదవొచ్చు" ఆమె మరింక మాట్లాడలేకపోయింది. అతని మాటల్లో వాస్తవం జీరగా కనిపిస్తున్నట్లు ఓ భ్రమ! ఆమె అతని ముఖంవైపు ఓ క్షణం పాటు తీక్షణంగా చూసింది. వెంటనే తల క్రిందకు దించేసుకుంది.



టీచర్: లెక్కలు తప్పులు చేసి ఇంకా నవ్వుతున్నారా సిగ్గులేదు?

విద్యార్థి: మా డాడీ చేసిన తప్పులకు నేనెందుకు సిగ్గుపడాలి?

**మంచాలశ్రీనివాసరావు** **ఫిరంగిపురం**

ఆమెకు తన పాత రోజులు గుర్తొచ్చాయి. తనీ రొచ్చు గుంటలోకి దిగిన మొదటి రోజులు జ్ఞప్తికొచ్చాయి. నిశీధిలో ఎడారిలో తన జీవిత ప్రస్థానంలో ఎన్నో పచ్చి పుండుల్లాంటి రాత్రుల్లో ఓ పెద్ద పచ్చి పుండు!

ఆమె తలలో మల్లెలు అప్పటికే వాడిపోయి కింద రాలిపోయి ఉన్నాయి. ఆమె ఓ లావుపాటి మనిషిని బయటకు పంపించేసి వచ్చి మంచం మీద వాలిపోయింది నీర్సంగా.

పేరు గుర్తు లేదు. పేరు చెప్పినట్లు కూడా గుర్తు లేదు. పేర్లతో ప్రసక్తిలేని దేహమే ప్రాణమై దేహమే బడా వ్యాపారమైన బడుగు బ్రతుకులామె వాళ్ళవి. నిండు యవ్వనంలోకి అప్పుడే అడుగుపెట్టిన పేరు తెలీని ఓ యువకుడు తలుపు తోసుకుని లోనికొచ్చాడు.

అతని రాక ఆమె గుర్తించలేదు. అప్పటికే ఆమె పూర్తి సుమప్తా వస్థలో ఉంది.

మనక వెలుతురులో ఆమెలో అణగిన వంపులు అతన్ని వివశుణ్ణి చేశాయి. గుండె తలుపులు తట్టేయి. నెత్తురు వరదకుగట్లు తెంచేయి.

అతను మరో రెండడుగులు ముందుకేసి ఎదురుగా గోడకు వేలాడుతున్న హరికేన్ లాంతరు వత్తి పెద్దది చేసేడు. ఆ వెలుగులో ఆమె మూట గట్టిన అందమైన అవయవాల మూటలా అనిపించిందతనికి.

అతను ఆమె ప్రక్కనే కూర్చొని చిన్నగా ఆమె భుజం మీద చెయ్యి వేశాడు. కానీ ఆమెలో ఏమాత్రం కదలిక లేదు. కాస్త అలా భుజం కదిపాడు. ఆమె కళ్ళు చిన్నగా తెరచుకున్నాయి. ముందు కాస్త సంభ్రమంగా చూసిందతని వైపు. అతను మాత్రం అలా కళ్ళార్పకుండా నవ్వుతూ చూస్తూనే ఉన్నాడు. ఆమెవైపు. ఆమె కూడా తన చూపు అతని వైపు నుంచి మరల్చలేకపోయింది. తన దగ్గరకు ఎందరో వస్తుంటారు పోతుంటారు. కానీ ఎవర్ని చూసినప్పుడు ఎవరికి ఆనందం పంచుతున్నప్పుడు కూడా తను ఆనందం అనుభవించిన అనుభవం లేదు తనకి ఇంతవరకు. కానీ ఎందుకో అతన్ని అలా చూస్తుంటేనే చెప్పలేని ఆనందపడిపోయినట్లుగా భావన చెందింది.

అతనిలో ఏదో బలీయమైన ఆకర్షణ ఆమెను మైమరపింప చేసింది. బహుశా అదే ప్రేమో లేక, కనీసం ప్రేమ లాంటిదేమో!

"ఏంటలా ఆశ్చర్యంగా చూస్తున్నావు? నన్ను గుర్తు పట్టలేదా! పక్కవీధిలో ఉంటాను. రోజూ నీ కోసం ఈ వీధిచివర కాపుకాసే నీ ప్రియుణ్ణి". కానీ అతన్ని చూసిన గుర్తు ఆమెకు ఏమాత్రంలేదు. పైకి లేవడానికి ప్రయత్నించి విఫలమవబోతుండగా అతనందించిన చేయూతతో పైకి లేచి కూర్చొంది.

"ఎప్పట్నుంచో నీ దగ్గరకు రావాలని ప్రయత్నిస్తుంటే ఇప్పటికి కానీ సాహసం చేయలేకపోయాను" ఆమెలో ప్రతిస్పందన ఎలా ఉంటుందోనని ఆమె వైపు ఉత్సాహంగా చూశాడు. కానీ ఆమెలో ఏ భావమూ లేదు.

"నీ దగ్గరకు రావాలని ఎందుకనుకున్నానో తెల్సా"

"అందరూ ఎందుకొస్తుంటారో నువ్వూ అందుకే వచ్చుంటావ్" అతని మాటలు చాలా తేలిగ్గా కొట్టిపడేస్తూ అంది. "లేదు లేదు. అందరిలో ఒకడిగా నన్ను లెక్కకట్టకు. అందరిలా అయితే ఎప్పుడో వచ్చుండే వాడినే కానీ ఇంతగా ఆలోచించుకుని ఇంతగా ప్రిపేర్ అయి రావాల్సిన అవసరం లేదు" ఎంతో ఆవేశంగా అన్నాడు అతను. ఆమె అతనివైపు అర్థం కానట్లు చూసింది. అతను ఆమెకు దగ్గరగా జరిగి ఆమె భుజాల మీద చెయ్యివేసి చెప్పాడు "నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నిన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నిన్ను నాస్వంతం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. అందుకు నీ అంగీకారం కోసమే ఇక్కడకు వచ్చాను.

ఆ మాటలకు ఆమె ముఖంలో వెన్నెల వర్షించింది ఏకధారగా. తన జీవితంలోకి వసంతం రాబోతుందని ఎంతగానో సంబరపడిపోయింది.

ఆ మాటలను మహదానంద భరితురాలైన ఆమె అతని కౌగిలికి లొంగిపోయింది. తన సత్తువ నెదుర్కొని లేని ఓపిక తెచ్చి పెట్టుకుని అతని ఆరాటానికి ఆహ్వాన గీతం ఆలపించింది. ఆ రాత్రి గడచిపోయింది. అతని రక్తం చల్లబడిపో

యింది. అలాంటి రాత్రులు ఇంకా ఎన్నో గడిచిపోతూనే ఉన్నాయి. 'నిన్ను ప్రేమిస్తున్నాను గాఢంగా. పెళ్ళి చేసుకుంటాను త్వరలోనే' అని అతను అంటూనే ఉంటాడు. కానీ ఆమె మాత్రం అడగదుఎప్పుడు' అని!

ఎలాగైతేనేం ఓరోజు ఉదయాన్నే అతను తిరిగి వెళ్ళిపోతుంటే ధైర్యం చేసి నిలదీసింది. 'ఎప్పుడు?' అని!

"ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఊరి చివరి రైల్వేస్టేషన్ కొచ్చేయ్. నీ కోసం ఎదురు చూస్తుంటాను. ఇక్కడ్నుంచి మనిద్దరం వెళ్ళిపోదాం. గతం మర్చిపోయి కొత్త జీవితాలు ప్రారంభిద్దాం. సరేనా తప్పకుండా వచ్చేస్తావుకదూ!" ఆమె నుదుటి మీద చివరి సారిగా ముద్దిడి అక్కడ్నుంచి కదిలాడు అతను వెళ్ళిపోతున్న అతని వైపు ఎంతో గౌరవంతో మరెంతో ప్రేమతో అలానే చూస్తూ నిలబడిపోయింది ఆమె. ఆమెలో ఎంతటి నూతనోత్సాహం! ఎంతటి ఆశ్లేషం! మరెంతటి అనంతమైన ఆశ!!

ఆమె మనను గాల్లో తేలిపోయింది. ఆనందం తట్టుకోలేక తత్తర బిత్తరైపోతోంది.


తన ఎడారి జీవితంలో ఎండమావి ఒకటి ఉంటుందని కలలో కూడా ఊహించలేకపోయింది.

సాయం సంధ్య ఎలా అంత త్వరగా ప్రత్యక్షమైందో గమనించలేకపోయింది అతని ఆలోచన లోపడి. నాలుగు జతల బట్టలు, ముఖ్యమైన వస్తువులు ఏవో సూటుకేసులో సర్దుకొని రైల్వేస్టేషన్ వైపు నడక సాగించింది. సంజాకాంతులు దూరాన మామిడి తోపులో మూగవారుతున్నాయి. చెట్టు కొమ్మల్లో చిక్కిన చినిగిన గాలిపటం గాలికి చిక్కుల్లోంచి ఊడి ఆమెను తాకుతూ నేల మీద పడింది.

రైల్వే స్టేషన్! ఆ ఊరి చివరనున్న ఒంటరి స్టేషన్!! ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు తప్పించి మరెవ్వరూ లేరు. సమయం సరిగ్గా ఆరు గంటలవుతోంది. ఆమె వెళ్ళి అక్కడ ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చొంది. అక్కడున్న ఇద్దరు ముగ్గురు ఆమెవైపు కళ్ళప్పచెప్పి అలానే చూస్తున్నారు. ఆమె ప్రవేశ ద్వారం వైపు దృష్టి మరల్చకుండా చూస్తూనే ఉంది.

ఏదో ఓ ప్యాసింజర్ ట్రైయిన్ వచ్చి ఆగింది. అతను రావాల్సిన సమయం దాటిపోతోంది. అప్పుడే ఆమెలో మొదలయ్యింది ఆమెకు తెలియకుండానే ఆందోళన. అయినా ఇంకా ఆమెలో ఆశ చావలేదు. ఆమె కళ్ళు అటువైపు చూడటం మానలేదు.

చుట్టూరా చీకట్లు కమ్ముకున్నాయి రాత్రికి స్వాగతం పలుకుతూ. ఇక ఆమెలో ఆశ సన్నగిల్లింది. ఆమె కళ్ళు తడయ్యాయి. ఆమె హృదయం చిత్తడయ్యింది.



"కొబ్బరి బొండాం తాగకముందు బాగానే ఉన్నవాడు, తాగేక వడ్డాడేమిటయ్యా అతడు" ఓ షాప్ వాడిని అడిగాడు వక్కవాడు.

"ఏమీలేదు కొబ్బరిబొండాం రేటు చెప్పేసరికి కళ్ళు తిరిగి ఉంటాయి" మామూలుగా చెప్పాడు షాప్‌వాడు.

-యేతారి శ్రీనివాస్ మండపేట

అతను ఇక రాడన్నట్టే! అంతే ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆమె సూట్ కేసు తీసుకొని వెనుదిరిగింది. మొట్టమొదటిసారిగా ఆమెలో నిరాశ! నిస్పృహ!!

నిజానికి తనకెప్పుడూ పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన తట్టలేదు. అసలు ఆ కోరికే ఉండుంటే తనీ వృత్తి చేపట్టుండేదే కాదు. అయినా తననెవరు చేసుకుంటారు పెళ్ళి?! తనెంత నీతిమంతురాలైనా తన వెనుకాముందూ చూస్తే తననెవరూ చేసుకోరు గదా! అందుకే ఆ ఆలోచనకు ఏమాత్రం అవకాశమివ్వలేదు మొదట్నుంచీ. కానీ ఎక్కడ్నుంచో సంద్రం మధ్యలోంచి కొట్టుకొచ్చిన తరంగమొకటి తనని కదిపేసింది. అప్పటివరకు ముక్కు మొహం తెలీని ఓ వ్యక్తి వచ్చి పెళ్ళి చేసుకుంటాననేసరికి ఆనందం వరదకు. గట్లు తెగేయి.

తన లాంటి వాళ్ళను పెళ్ళి చేసుకునే వాళ్ళున్నారని గుడ్డిగా నమ్మినందుకు తన మీద తనకే చిరాకేసింది. తను ప్రేమించినదో లేక కట్టుకున్నదో కనీసం కామించిన ఆడదైనా పరాయివాడివైపు చూస్తేనే తట్టుకోలేని స్వార్థపరుడు పురుషుడు. అటువంటిది తనలాంటి వాడ వదినను పెళ్ళి చేసుకుంటానంటే తనెలా నమ్మ గలిగింది? అంత తేలిగ్గా ఎలా మోసగించబడింది?! ఆమెకు తిరిగి ఇంటికెళ్ళ బుద్ధి కాలేదు. ఎందులోనైనా దూకేద్దామా అనిపించింది. ఆమెలో ఏదో వైరాగ్యం! తను ఎందుకోసం బ్రతకాలి?ఎవరి కోసం బ్రతకాలి?? తనకు 'నా' అని చెప్పుకోదగ్గ వాళ్ళెవరూ లేరాయె. తన దుఃఖంలో దుఃఖాన్ని తన సంతోషంలో సంతోషాన్ని పంచుకోగల వారెవరూ లేరాయె.

ఠాగూరు కాబోలు అంటాడు జనం ఎంతమంది ఉన్నా ఎప్పుడూ ఎవరిచేత ప్రేమించబడని ఒంటరి బాట అని! అదే నిజమైతే ఆమె కూడా ఓ బాట లాంటిదే! కనీసం ఉంటానికి ఓ సొంత ఇల్లు కూడా లేక తన జీవితం లాంటి అద్దె కొంపలో జీవిస్తున్న ఒంటరి ఆడది ఆమె. అవును ఆమె ఒంటరి! ఒకటంకె లాంటి ఒంటరి!

ఒకరోజును ముందుకు లాక్కెళ్ళడం కోసం ఓ రాత్రి మంటల చితిమీద పడుకోవడానికి సిద్ధమౌతుంది. ఈ మాయా ప్రహసనంలో ఓ రాత్రి ఎవరికైనా భార్యగా నటించడానికి సన్నాహమౌతుంది. ఆ ప్రయత్నంలో వళ్ళంతా గాయాలు చేసుకుంటుంది. కన్నీళ్ళను కళ్ళల్లోంచి వెనక్కి పంపించేసుకుని గుండెల్లోనే ఇంకిపోయేటట్లు చేసుకుంటుంది.

ఇదంత ఎందుకు? కేవలం రెండు పూటల భుక్తి కోసం! వయసు మీద పడి శరీరం ముడతలు పడి వయసు వంపులు తనువు సొగసులు మాయమైతే మరి ఆ భుక్తికి మార్గమేంటి?? ఏముందీ- అనాథ శరణాలయంలో ఎందరో అనాథల్లో ఓ అనాథ అవుతుందేమో లేకుంటే ఈ అనంతమైన భూమ్మీద ఎక్కడో ఓ బిచ్చగత్తెగా మొలకెత్తుతుందేమో!

పాపం! మాతృత్వంతో మహదానందం చెందే 'స్త్రీ మూర్తి' కాదు గదా ఆమె 'అమ్మా!' అని పిలిపించుకునే అద్భుతమైన అదృష్టం లేని అపవిత్రమూర్తి గదా ఆమె! "ఏమిటలా మౌనంగా ఉండిపోయావే మాట్లాడవే?!" అన్న అతని మాటలకు మళ్ళీ వాస్తవంలోకి వచ్చింది ఆమె.

అతన్ని చూసి ఆమె నిర్వేదంగా నవ్వింది.

లాంతరు వత్తి కిందకు దించింది.

బయట గూర్ఖావాడు వేసిన విజిలు విని మామూలు వసూలుకొచ్చిన పోలీసేమోననుకుని కంగారు పడినా, వెంటనే గుర్తుకొచ్చి ఆ టైమ్‌లో వసూలుకు రారని ఊపిరి పీల్చింది. అలా ప్రతి రాత్రీ గూర్ఖా వాడి విజిలుకు భయపడుతూ వెంటనే సర్దుకోవడం మామూలే ఆమెకు! మరి కాసేపటికి చుట్టుకున్న నాలుగు చేతులు విడిపోయాయి. బయట పూర్తిగా తెల్లారిపోయింది.

అతను అక్కడ్నుంచి వెళ్ళిపోతూ ఆమె భుజాల మీద చేతులుంచి అన్నాడు గాంభీర్యంగా "ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఊరి చివరి రైల్వేస్టేషన్ దగ్గర కొచ్చేయ్ నీ కోసం ఎదురు చూస్తుంటాను. ఇక్కడ్నుంచి మనిద్దరం వెళ్ళిపోదాం. గతం మర్చిపోయి కొత్త జీవితాలు ప్రారంబిద్దాం. సరేనా వచ్చేస్తావు కదూ!" అంటూ వెనుదిరిగాడు అతను. ఆమె వెలుగుతున్న దీపం కాదు ఆర్పెయ్యడానికి. అప్పటికే వెలుగు ఆరిపోయిన, మోడు వారిన నిశీధి ప్రమిద ఆమె.

అక్కడ్నుంచి కదలబోతున్న డబ్బుల్లేకో డబ్బులివ్వలేకో, ఆశలు కల్పించి అవసరాలు తీర్చుకునే ఎందరో మగాళ్ళలో ఒకడైన అతని భుజం మీద చెయ్యి వేసి రుద్ధకంఠంతో ఆమె అన్న మాటలు "ముందు డబ్బిచ్చి వెళ్ళు".